క్లుప్తంగా

లింగంపేట ఎంపీడీవోగా మల్లికార్జున్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ఎంపీడీవోగా మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన లింగంపేట ఎంపీడీవోగా పనిచేసి ఎల్లారెడ్డి ఇంచార్జి ఎంపీడీవోగా బదిలీపై సంవత్సరం క్రితం వెళ్లారు. తిరిగి లింగంపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

బీర్కూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా శ్రీలేఖ

బాన్సువాడ టౌన్: బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా శ్రీలేఖను నియమించారు. జిల్లా వైద్యాధికారులు జుక్కల్ మండలం డోంగ్లీ పీహెచ్‌సీలో విధులు నిర్వహించే శ్రీలేఖను డిప్యూటేషన్‌పై బీర్కూర్‌కు బదిలీ చేశారు. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో బీర్కూర్‌లో పని చేసిన వైద్యులు రఘుపతి పీజీలో సీటు రావడంతో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీలేఖ వచ్చారు.

బీజేపీలో చేరిక



కామారెడ్డి టౌన్: భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కండువా కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ గ్రామ మూల మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయించాలని సర్పంచ్ మారుతి, గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ మార్గంలో వారం క్రితం ఇసుక వాహనం ఢీకొని యువకుడు మృతి చెందారని తెలిపారు. వాహనాల అతివేగం తగ్గించడానికి బ్రేకర్లు వేయించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు.

బీమా చెక్కు అందజేత

రాజంపేట: ఎల్లాపూర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో 8 నెలల క్రితం తండాకు చెందిన బోడ నవీన్ విద్యుత్ షాక్‌తో మరణించాడు. దీంతో వారి కుటుంబానికి మంజూరైన ప్రమాద బీమా చెక్కు(రూ.5 లక్షలు)ను ఎంపీపీ లింగాల స్వరూప నవీన్ తండ్రి అంబర్ సింగ్‌కు అందజేశారు. సర్పంచ్ పార్వతిరాజు, ఏఈ మారుతి, మాజీ ఎంపీపీ నీరడి శంకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

మద్నూర్(జుక్కల్): మండలంలోని సోనాలకి చెందిన రాజీవ్‌కుమార్ కుటుంబ సభ్యులకు శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్ రూ.80 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా అర్హులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

క్షయవ్యాధిని అంతమొందించాలి

కామారెడ్డి టౌన్: క్షయవ్యాధిని జిల్లాలో అంతమొందిచాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ప్రైవేట్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రుల్లో కేసుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట మెడికల్ కళాశాల వైద్యులు సదానందం, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ఉష్మ, డాక్టర్ స్టెల్లాలు అవగాహన కల్పించారు.

జాతీయ స్థాయి జంబోరికి విద్యార్థుల ఎంపిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి జంబోరి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళి శుక్రవారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉన్నత పాఠశాలకు చెందిన ముజ్జాడ శివాణి, గనోభా అర్చనలు పాల్గొని తమ ప్రతిభను చూపారు. అక్కడ జరిగిన మార్చ్ ఫాస్ట్, కలర్ పార్టీ, అడ్వెంచర్ ఈవెంట్, నృత్య ప్రదర్శనలో వీరికి ఏ- గ్రేడ్ వచ్చినట్లు తెలిపారు.

భూ ఆక్రమణను అడ్డుకోవాలి

రాజంపేట: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సర్వే నెంబరు 638/ఏ నెంబరులో గల నాలుగు గుంటల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ జానకికి వినతి పత్రం అందజేశారు. ఆ భూమి యజమాని మరణించినందున ప్రస్తుతం వారసులు ఎవరు లేరని తెలిపారు. దీనిని అదునుగా చేసుకుని కొందరు అధికార బలంలో ఆ భూమిని ఆక్రమించడానికి పాల్పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి పిట్ల శ్రీను, రాము, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన



కల్యాణిలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్ శరత్, సిబ్బంది



బీబీపేటలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు



జలాల్‌పూర్‌లో కంటివెలుగు ట్రయల్‌రన్



మాట్లాడుతున్న నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 'కంటి వెలుగు' కేంద్రాలను వైద్యులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. పట్టణాలతో పాటు పలు గ్రామాల్లో ఈ నెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న దృష్ట్యా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలుచోట్ల వైద్య సిబ్బంది ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే వారి ఆధార్ కార్డు వివరాలతో పాటు ఇతర వివరాలను ఆన్‌లైన్ చేయడంపై ట్రయల్ చేశారు. కంటి వెలుగు కేంద్రాల్లో వైద్య సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నివసతులు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బందిని, వీఆర్‌ఏలను, వీవోఏలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. అంతే కాకుండా ప్రతి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు వివరించాలన్నారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహ కల్పించాలని సూచించారు.



ఫరీదుపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సతీష్



పెద్దమల్లారెడ్డిలో.. ఏపీవో ప్రవీణ్‌కుమార్



బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో సీసీలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్



వెల్గనూర్‌లో కంటి వెలుగు నిర్వహణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పిట్లంలో.. పరిశీలిస్తున్న అధికారులు



లింగంపేటలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

క్రీడాప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను యువత సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సూచించారు. మండలంలోని మెల్లకుంటతండా, ఎర్రకుంటతండా, పోచారం, తాండూర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాలను శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతోపాటు మానసికోల్లాసం పెరుగుతుందని చెప్పారు. ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీని వాస్, సర్పంచ్‌లు కేస్లీ, మంగ్లీ, విజితరెడ్డి, గంగమణి, ఎంపీటీసీ వినీతరెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో గడ్డి విత్తనాలు

మద్నూర్(జుక్కల్): ఎస్‌ఎస్‌జీ-898 జొన్న రకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశువైద్యాధికారి బండివార్ విజయ్ తెలిపారు. మండల కేంద్రంలోని పశువైద్య శిబిరంలో శుక్రవారం గడ్డి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ దరాస్ వార్ సురేశ్ ప్రారంభించారు. ఈ విత్తనాలను ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ విత్తనాలు నాటిన 45 రోజులకు కోతకు వస్తుందన్నారు. కావాల్సిన రైతులు పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు.

గోదారంగనాథుల కల్యాణం

కామారెడ్డ అర్బన్/తాడ్వాయి: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్‌నగర్‌లో, చిన్నమల్లారెడ్డిలో, తాడ్వాయి మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో గోదారంగనాథుల కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు.

చైనా మాంజాను విక్రయిస్తే కేసులు



తనిఖీలు చేస్తున్న అటవీశాఖ అధికారులు

రామారెడ్డి: పక్షులకు ప్రాణాంతకంగా మారిక చైనీస్ మాంజాను సంక్రాంతి సందర్భంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని అటవీశాఖ బీట్ ఆఫీసర్ శ్రీధర్, రామారెడ్డి ఎస్సై అనిల్ హెచ్చరించారు. శుక్రవారం రామారెడ్డి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా చైనీస్ మాంజా వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు.

భిక్కనూరులో తనిఖీలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని పతంగిల విక్రయ దుకాణాలను అటవీశాఖ అధికారులు తనిఖీ చేశారు. చైనా మాంజాను విక్రయిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని అందుకే తనిఖీలు నిర్వహించినట్లు భిక్కనూరు అటవీశాఖ సెక్షన్ అధికారి అనురంజనీ తెలిపారు.

దాబాలపై నుంచి ఎగురవేయవద్దు

భిక్కనూరు: పతంగిలను దాబాలపై నుంచి ఎగురవేయవద్దని భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలో ఆయన పతంగిల విక్రయ దుకాణాలను తనిఖీ చేసి చిన్నారులు, యువకులతో మాట్లాడారు. పతంగిలను మైదాన ప్రాంతాల్లోనే ఎగురవేయాలన్నారు. చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకనే చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించిందన్నారు.

గెలుపోటములు సహజం

● ఎమ్మెల్యే జాజాల సురేందర్



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జాజాల

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. ఓడిన వారు వచ్చేసారి గెలవడానికి ప్రయత్నించాలన్నారు. తాడ్వాయిలో మినీస్టేడియం నిర్మాణ పనుల కోసం నిధులను మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని క్రీడాకారులకు ఏమైన సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొచ్చినట్లయితే తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. 44 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో మొదటి బహుమతి గెలుపొందిన తాడ్వాయి జట్టుకి రూ.51వేలు, రెండో స్థానంలో నిలిచిన నందివాడ జట్టుకు రూ.20వేలు, మూడో స్థానంలో నిలిచిన ఎర్రాపహాడ్ జట్టుకు రూ.10 వేల చొప్పున అందించారు. మొదటి, రెండవ, మూడవ స్థానంలో నిలిచిన జట్ల క్రీడాకారులందరికి స్పోర్ట్స్ షూస్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా పలువురిని సన్మానించారు. సర్పంచ్ సంజీవులు, పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కౌడి రవి, వైస్ ఎంపీపీ నర్సింలు, సీడీసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, నిర్వాహకులు హీరాలాల్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



రామారెడ్డి(ఎల్లారెడ్డి): యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు గంప శశాంక్ సూచించారు. అన్నారం గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. టోర్నమెంట్‌ను ప్రారంభించిన గంపశ శాంక్ రెండు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, సర్పంచ్ అమృత, యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మైసాగౌడ్, స్వామిగౌడ్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పిట్లంలో మొక్కలకు నీరు పెడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

పిట్లం(జుక్కల్): నాటిన మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో వెంకటేశ్వర్‌లు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా మండల కేంద్రంలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో అధికారులు, నాయకులతో కలిసి మొక్కలకు నీళ్ల పోశారు.

నిజాంసాగర్(జుక్కల్): పల్లె ప్రకృతి వనాలతో పాటు రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని ఎంపీడీవో నాగేశ్వర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రకృతి వనంలో చెట్లకు నీళ్ల పట్టి వాటరింగ్ డే నిర్వహించారు.

మాచారెడ్డి: ప్రభుత్వ కార్యాలయాల ఆవరణతో పాటు పంచాయతీ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు వారానికోసారి నీరు పడుతూ సంరక్షించాలని డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. శుక్రవారం బండరామేశ్వర్‌పల్లిలో పంచాయతీ ఆవరణలో మొక్కలకు నీళ్లు పట్టారు.

మద్నూర్(జుక్కల్): మొక్కలకు నీరు పోసి కాపాడుకోవాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దరాస్ సురేశ్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలకు నీరు పోశారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీరు పోశారు. ఎంపీడీవో అనంత్‌రావు, సర్పంచ్ తున్కి వేణు, ఉప సర్పంచ్ నరేష్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ తనిఖీ



దోమకొండ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కొనుగోలుదారులు, విక్రయదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ అన్నారు. శుక్రవారం ఆయన దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని స్టాంపుల విక్రయాలు, రిజిస్ట్రేషన్‌ల తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా కార్యాలయ సిబ్బంది రవికిరణ్, ప్రవీణ్, సబ్ రిజిస్ట్రార్ సతీష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

దళితబంధుతో ఆర్థికంగా ఎదగాలి

● కలెక్టర్ జితేష్ వి పాటిల్



పిండి పదార్థాలను కొనుగోలు చేస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం/భిక్కనూరు: దళితబంధు పథకంతో లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. భిక్కనూర్ మండలం సిద్ధిరామేశ్వరనగర్‌కు చెందిన సుధాకర్, శివలత దంపతులకు మొదటి విడతలో దళిత బంధు పథకం కింద రూ.10 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో వారు పిండి వంటల తయారీ యూనిట్‌ను నెలకొల్పారు. శుక్రవారం వారు కలెక్టర్ పాటిల్‌ను ఆయన చాంబర్లో కలిశారు. నెలకొల్పిన యూనిట్ ద్వారా తమకు నెలకు రూ.35 వేల ఆదాయం వస్తుందని లబ్ధిదారుడు మందుగుల్ల సుధాకర్ కలెక్టర్‌కు తెలిపారు. సిద్ధిరామేశ్వర మిక్చర్ అండ్ బూందీ పేరిట 11 రకాల నాణ్యమైన మిక్చర్లను తయారు చేసి విక్రయిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా దళిత బంధు లబ్ధిదారుడి నుంచి బూంది, మిక్చర్ ప్యాకెట్లను కలెక్టర్ కొనుగోలు చేశారు. వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, భిక్కనూర్ ఎంపీడీవో అనంతరావు, అధికారులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ ఎదుట ధర్నా



బాన్సువాడ టౌన్: పట్టణంలోని మహేశ్వరి సినిమా థియేటర్ ఎదుట చిరంజీవి అభిమానులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా విడుదల కావడంతో మహేశ్వరి టాకీసులో సినిమా ప్రదర్శన ఉందని తెలుసుకున్న చిరంజీవి అభిమానులు ఉదయమే టాకీసు వద్దకు వచ్చారు. 11 గంటలైనా చిరంజీవి సినిమాకు సంబంధించి ఎలాంటి సమాచారం అందలేదని టాకీసు సిబ్బంది చెప్పడంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. థియేటర్ ముందు ధర్నా చేసి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): పోస్టల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి పోస్టల్ డివిజన్ అధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన లింగంపేట సబ్ పోస్టాఫీసు పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పలుచోట్ల పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే డిపాజిట్‌లపై ఎక్కువ వడ్డీ రేట్‌లు, బోనస్‌లు ఇస్తుందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు మహబూబ్, మురళి, లింగం, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

■ **మండల స్థాయి వాలీబాల్ క్రీడలు**

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేష్, భాస్కర్, అరవింద్‌లు తెలిపారు. పాల్గొనే వారు 14లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

■ **17న ఇంటర్వ్యూలు**

కామారెడ్డి అర్బన్: మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 17న ఉదయం 11 గంటలకు దేవునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాన్, ఆధార్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయండి: టీడీపీ

కామారెడ్డి టౌన్: రైతులకు నష్టం చేస్తున్న మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని టీడీపీ నిజామాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ చేశారు. శుక్రవారం ఆయన కామారెడ్డిలో రైతులతో మాట్లాడారు. చుట్టు పక్కల 8 గ్రామాలతో పాటు పట్టణంలోని రైతులు, ప్రజల భూములు, ప్లాట్లలో 100 ఫీట్ల రోడ్డును వేస్తూ అన్యాయం చేస్తున్నారని,దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

పండుగకు ఊరెళ్తే సమాచారం ఇవ్వాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి మండలాలకు చెందిన ప్రజలు సంక్రాంతి పండుగకు ఊరెళ్లాల్సి వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ రామన్ సూచించారు. సొంతూళ్లకు వెళ్లే వారికి కీలక సూచనలు చేశారు. తమ ఇళ్లలో దాచుకున్న నగలు, డబ్బును దోచుకెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఇళ్లలో లైట్లు వేసి ఉంచాలన్నారు. ఎస్సై రాజేశ్ తదితరులున్నారు.

సంక్షిప్తం

అమ్మవారికి బంగారు ముక్కుపుడక అందజేత

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి అలయ అమ్మవారికి శుక్రవారం గ్రామానికి చెందిన బోడపుంటి కాశీనాథ్ బంగారు ముక్కుపుడకను అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్ తెలిపారు. ఆలయ ధర్మకర్తలు రాజిరెడ్డి, రాజయ్య, రాజనర్సు, తదితరులు ఉన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

నిజాంసాగర్(జుక్కల్): గాలీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అదనపు గదుల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి భూమిపూజ నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ జెడ్పీ నిధులు మంజూరు చేశారు. దఫేదార్ విజయ్, ఎస్‌ఎమ్‌సీ చైర్మన్ గంగారాం పాల్గొన్నారు.

మార్కండేయ ఉత్సవ విగ్రహం అందజేత

బాన్సువాడ రూరల్: తాడ్కోల్‌కు చెందిన మార్కండేయ మాలధారులకు శుక్రవారం బాన్సువాడకు చెందిన గోంట్యాల బాలక్రిష్ణ, మార్కండేయ ఉత్సవ విగ్రహాన్ని అందజేయడానికి ముందుకు వచ్చారు. మార్కండేయ ఉత్సవ విగ్రహం ఖరీదు రూ.16,551 నగదును మాలాధారులకు అందజేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

బిచ్కుంద(జుక్కల్): బండరెంజల్‌లో శుక్రవారం సర్పంచ్ బాల్‌రాజ్ తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ట్రాక్టర్లు నడవడంతో పైపులు తరుచూ పగిలిపోతున్నాయి. ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడవద్దని వెంటనే మరమ్మతులు చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

రాజంపేట: మండల కేంద్రానికి రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి రాక నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ఆముద నాగరాజు సరంపల్లి వద్ద పైపులైన్ మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

మూగజీవాలకు టీకాలు

నిజాంసాగర్(జుక్కల్): వెల్గనూర్‌లో దళిత బంధు పథకం కింద పంపిణీ చేసిన గొర్రెలు, మేకలకు శుక్రవారం గ్రామ సర్పంచ్ రమేష్‌గౌడ్ టీకాలు వేశారు. గ్రామంలోని దళితులు దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తడిపొడి విధానంతో అధిక లాభాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తడిపొడి విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని పద్మపాని స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్‌లు రమాకాంత్ రావు, సంతోష్‌లు అన్నారు. శుక్రవారం మోడెగాంలో వరి పంట సాగులో తడిపొడి విధానంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కుంట తిరుమల, ఉప సర్పంచ్ మాచెర్ల రాజులు, విండో వైస్ చైర్మన్ కుంట శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్‌లో చెరుకు క్రషింగ్ గురువారం నాటికి 2 లక్షల 15 వేల 462 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ తెలిపారు.

ప్రతి పండుగ పర్యావరణంతో ముడిపడి ఉన్నదే



కామారెడ్డి అర్బన్: సంక్రాంతి పండుగ ఉన్నత సంస్కారాలు, ఒకే ధర్మం, ఒకే సంస్కృతి, ఆలోచన ఆకాంక్షలతో జరుపుకునేదని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ కె.నరేశ్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర శాఖ సంక్రాంతి ఉత్సవం శుక్రవారం కామారెడ్డి శ్రీసరస్వతీ విద్యా మందిర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ ప్రసంగిస్తూ హిందువులు నిర్వహించే ప్రతిపండుగ పర్యావరణంతో ముడిపడి ఉంటుందన్నారు.

ప్రతి ఒక్కరూ 15 మొక్కలు పెంచాలి

సంక్రాంతి ఉత్సవం అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ పర్యావరణ సంరక్షణ గతివిధి(విభాగం) ఆధ్వర్యంలో ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో వివిధ రకాల 15 మొక్కలు పెంచి బయట నాటాలని ఆర్‌ఎస్‌ఎస్ పర్యావరణ సహ కార్యదర్శి మునీశ్వర్ కోరారు. విద్యామందిర్‌లో నిర్వహించిన పర్యావరణ సంరక్షణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రకృతికి కృతజ్ఞతగా ప్రతి ఒక్కరూ విత్తనాలు సేకరించి మొక్కలు నాటడం సమాజానికి హితం చేసినవారు అవుతారన్నారు.